
సాక్షి ఒడిశా

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,46,930లు. బంగారం 10 గ్రాము 900 మిల్లీగ్రాములు, వెండి 52 గ్రాములు 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఒడిశా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రదర్శన ఆకట్టుకుంది.

- 10లో



ఉపాధ్యాయిని ఇంట్లో చోరీ

రాయగడ సాయిప్రియ నగర్ ఆరో లైన్‌లో నివసిస్తున్న ఉపాధ్యాయిని సీహెచ్ గంగా ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది.

- 10లో

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు



చికిత్స పొందుతున్న హమేష్

జయపురం: రోడ్డు ప్రమాదంలో 15 ఏళ్ల బాలుడు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం సాయంత్రం బొయిపరిగుడలో చోటుచేసుకుంది. బొయిపరిగుడ గ్రామంలోని బీరకంభ వీధికి చెందిన నీలకంఠ మండి కుమారుడు హమేష్ మండి(15) తన ఇద్దరు స్నేహితులతో కలిసి బైక్‌పై సమీపంలోని పంటిమేశ్వర మందిరం వద్దకు వెళ్లాడు. అక్కడ సరదాగా విహరించిన అనంతరం మందిరం నుంచి తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో దురదృష్టవశాత్తు మందిర సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో హమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడితో బైక్‌పై వచ్చిన మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వారిని ఒక ఆటోలో బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జయపురం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రైలు ఢీకొని యువతికి గాయాలు



రజని బెహర (ఫైల్)

రాయగడ: స్థానిక సంతోషమాత మందిరం సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైలు ఢీకొన్న ఘటనలో ఒక యువతికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో చోటుచేసుకున్న ఘటనలో గాయాలు తగిలిన యువతి స్థానిక జగన్నాథ మందిరం సమీపంలో నివసిస్తున్న రజని బెహర(26)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయాలపాలైన ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం రిఫర్ చేశారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. రజనీ ఒక ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తోంది. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైలు పట్టాలు దాటుకుంటూ వెళ్తుండగా, అదే సమయంలో జునాగడ్-భువనేశ్వర్ ట్రైన్ ఢీకొంది. గత కొద్దినెలలుగా మార్కెట్ సమీపంలోని అండర్ గ్రౌండ్ రహదారిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి రైల్వే శాఖ మూసివేయడంతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బ్రిడ్జిపై వెళ్లకుండా బ్రిడ్జి కింద రైలు పట్టాలు దాటుకుంటూ వెళ్తుండడం కొందరికి పరిపాటిగా మారింది.

'మావో' బ్యానర్ల కలకలం



మండిబిసి గ్రామంలో వెలసిన బ్యానర్లు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి మండిబిసి గ్రామంలో గురువారం మావోయిస్టుల బ్యానర్లు కలకలం సృష్టించాయి. స్థానిక రెవెన్యూ అధికారి కార్యాలయం, మరో రెండుచోట్ల బ్యానర్లు, పోస్టర్లు దర్శనమివ్వడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమితిలోని సిజిమాలి, మంజింగొమాలి, కుట్రుమాలి తదితర ప్రాంతాల్లో బాక్సైట్ గనుల తవ్వకాలను తాము వ్యతిరేకిస్తున్నట్లు బ్యానర్లలో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలోని కంపెనీ, గుత్తేదారుల చేతుల్లో పోలీసులు, రాజకీయ నాయకులు కీలుబొమ్మలుగా మారారని సీపీఐఎంఎల్ మావో బన్సధార డివిజనల్ కమిటీ పేరిట పోస్టర్లు అతికించారు. గనుల తవ్వకాలను వ్యతిరేకిస్తున్న వారిపై తప్పుడు కేసులు బనాయించి జైళ్లపాలు చేస్తున్న నిరంకుశ పాలనకు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల ఏర్పాటు వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెబుతున్న ప్రభుత్వం, గత పదేళ్లలో రాష్ట్రంలోని 15 వేలకు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఎందువలన మూసివేసిందని ప్రశ్నించారు.



ఆర్ఐ కార్యాలయం గేటు వద్ద చెట్టుకు అతికించిన పోస్టర్

అతిథులుగా వస్తున్నాం.. కొన్ని రోజులు ఉండి వెళ్తాం..!



రాష్ట్రంలోని చిలికా సరస్సుకి ప్రతీ ఏడాదిలాగే ఈ ఏడాది సైతం కొద్ది రోజులుగా విదేశీ అతిథి పక్షుల తాకిడి పెరిగింది. తమ జాతి పక్షులతో జతకట్టి సంతానాభివృద్ధి కోసం చిలికా దీవుల్లో విడిదిని ఏర్పాటు చేసుకుంటున్నాయి. దీంతో ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ గూడు కట్టుకుంటున్న విదేశీ అతిథి పక్షులు వేటగాళ్ల బారినపడకుండా చిలికా వణ్యప్రాణుల అభివృద్ధి సంస్థ అధికారులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. గత 3 వారాల నుంచి ఆకాశంలో వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి విదేశీ పక్షులు ఇప్పటివరకు సుమారు 8.94 లక్షలకి పైగా చిలికా సరస్సుకి వచ్చి చేరినట్లు అధికారులు తెలియజేశారు. ఈ విదేశీ విహంగాలు సరస్సు మధ్యన ఉన్న బరుకుల్, నల్లబాల, కాళీజై, సత్తపరా, బ్రేక్‌పాస్టు, శరణ్, చోడైహోగా, మంగళాజోడి, పరికుడ్ దీవులకు చేరుకొని విడిది ఏర్పాటు చేసుకుంటున్నాయి.

– బరంపురం



నల్లబన దీవిలో పక్షుల సందడి

గత 16 ఏళ్లలో వచ్చిన విహంగాలు

సంవత్సరం	చిలికా సరస్సుకి	నల్లబన దీవికి
2004	9,37,043	2,57,631
2005	9,58,671	2,37,236
2006	6,78,783	2,58,660
2007	8,39,529	1,88,546
2008	8,92,998	4,00,490
2009	8,90,813	5,13,458
2010	9,24,578	5,08,081
2011	8,04,452	3,82,290
2012	8,77,322	3,46,877
2013	7,30,262	4,15,135
2014	7,61,940	4,67,532
2015	7,19,262	4,15,135
2016	8,58,885	4,83,502
2017	7,19,262	3,20,302
2018	8,94,256	5,48,586
2019	10,48,432	6,30,345
2020	లాక్‌డౌన్ వలన లెక్కించలేదు	
2021	8,94,543	4,25,302
2022	9,34,543	5,3,205
2023	ఇప్పటివరకు 8,64,000 పక్షులు చేరాయి	



మంగళజరి దీవిలో విహరిస్తున్న విదేశీ విహంగాలు



ఆహార అన్వేషణలో అతిథి పక్షులు



నల్లబన దీవిలో పక్షులను లెక్కిస్తున్న చిలికా వన్యప్రాణి అభివృద్ధి బృందం

జట్నీ ప్రాంతంలో పర్యటించిన గవర్నర్



విద్యార్థులతో ముచ్చటిస్తున్న గవర్నర్ రఘుబర దాస్

భువనేశ్వర్: రాష్ట్ర గవర్నర్ రఘుబర దాస్ ఖుర్దా జిల్లా జట్నీ ప్రాంతంలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్నటువంటి బిజు ఆదర్శ కాలనీ, ఖుద్దుపూర్ దివ్యాంగుల ఐటీఐ, బెణాపంజరి 5టీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మున్సిపాలిటీ 10వ వార్డు రఘునాథ నగర్ బిజు ఆదర్శ కాలనీ ప్రజలతో మాట్లాడారు. ఈ కాలనీలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ఇళ్లను పరిశీలించారు. ఖుద్దుపూర్ దివ్యాంగుల ఐటీఐ సందర్శించి సంస్థలో అభ్యర్థుల శిక్షణకు అవసరమైన వనరులు, సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఖుర్దా జిల్లా కలెక్టర్ కె.సుదర్శన్ చక్రవర్తి, జట్నీ మున్సిపల్ మండలి కార్య నిర్వహణ అధికారి (ఈవో) దిలీప్ కుమార్ మహంతి ఉన్నారు.



దివ్యాంగుల ఐటీఐ సందర్శిస్తున్న గవర్నర్

అధ్యక్షుడిగా రంజిత్ పాత్రో



భువనేశ్వర్: రాష్ట్ర యువజన కాంగ్రెస్ కొత్త అధ్యక్షునిగా రంజిత్ పాత్రో నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, బి.వి.రంజిత్‌ను అధ్యక్షుడిగా నియమించారు. అలాగే ఉపాధ్యక్షులుగా సాగర్ చరణ్‌దాస్, కృష్ణ మహంతిలు నియమితులయ్యారు. యువజన కాంగ్రెస్ కమిటీకి కొన్ని నెలల క్రితం ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రధాన కార్యదర్శి, కార్యదర్శుల జాబితా ఖరారు అయింది. అధ్యక్షుడు ఎవరన్న దానిపై సందిగ్ధం నెలకొంది. ఇప్పుడు ఈ సందిగ్ధత తొలగింది.

వింత జంతువు దాడిలో మేకలు మృతి

మల్కన్‌గిరి:

జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 67 గ్రామానికి చెందిన సునీల్ ఖల్దర్ అనే మేకల కాపరి 170 మేకలు, గొర్రెలు మేపుతున్నాడు. ఈ మేకల మందపై బుధవారం రాత్రి ఒక వింత జంతువు దాడిచేసి 40 మేకలను చంపివేసింది. అలాగే ఆ సమయంలో అక్కడికి వెళ్లిన సునీల్‌పై కూడా దాడి చేసింది. దీంతో గురువారం ఉదయం అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి చనిపోయిన మేకలు, గొర్రెలను పరిశీలించారు. యజమానికి ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం అందజేస్తామని తెలియజేశారు.



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న అధికారులు, వైద్యులు

అటవీ శాఖ రేంజర్ తంఖర్ దాస్ మాట్లాడుతూ వింత జంతువును కనిపెడతామని తెలియజేశారు.

ఈనెల 17 వరకు చలి గాలులు



భువనేశ్వర్: ఉత్తర, వాయువ్య దిశ నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో రాష్ట్రమంతటా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో 8 చోట్ల కనిష్ట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే తక్కువగా నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో అనేక ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదయ్యాయి. భువనేశ్వర్‌లోని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ప్రాంతీయ కేంద్రం సమాచారం ప్రకారం శీతాకాలపు చలి మరో 4 రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమయంలో రాష్ట్రంలో చాలా ప్రదేశాల్లో ఉదయం వేళల్లో దట్టమైన పొగ మంచు కమ్ముతోంది.

ఉదయగిరిలో వణికిస్తున్న చలి

మల్కన్‌గిరి జిల్లా జి.ఉదయగిరి రాష్ట్రంలో అత్యంత శీతల ప్రదేశంగా వణికిస్తోంది. ఈ ప్రాంతంలో రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రత 7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతోంది. తదుపరి స్థానంలో కిరే 9 డిగ్రీల సెల్సియస్, ఫుల్బాణి 9 డిగ్రీల సెల్సియస్, దారింగ్‌బాడి 9 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతతో గడగడలాడిస్తున్నాయి. కెంజొహర్, కొరాపుట్ ప్రాంతాల్లో వాతావరణం కొద్దిగా వెచ్చబడింది. ఈ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు వరుసగా 10.2 డిగ్రీల సెల్సియస్, 10.4 డిగ్రీల సెల్సియస్‌గా రికార్డైంది. సుందర్‌గడ్, సెమిలిగుడ ప్రాంతాల్లో వరుసగా 10.6 డిగ్రీల సెల్సియస్, 10.7 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జంట నగరాలైన భువనేశ్వర్, కటక్ ప్రాంతాల్లో 15.5 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఐఎండీ సమాచారం ప్రకారం ఈనెల 17వ తేదీ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగే అవకాశం ఉంది. రానున్న రెండు రోజుల్లో ఝార్సుగూడ, సుందర్‌గడ్, కెంజొహర్, అంగుల్, ఢెంకనాల్, బౌధ్, కలహండి, కంధమల్, కొరాపుట్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల ఉదయం నుంచి నిస్సారమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని చాలాచోట్ల వాతావరణం పొడిగా కొనసాగుతుంది.

వినూత్నం.. విజయవంతం

- పాలిథిన్ నివారణపై నందన కానన్ విభిన్న శైలి
- సత్ఫలితాలిస్తున్న ప్రయోగం
- హర్షం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు



పాలిథిన్ వినియోగం నివారణ ప్రక్రియ



నందన్‌కానన్ ప్రాంగణంలో ప్లాస్టిక్ బాటిళ్ల నియంత్రణ కేంద్రం

భువనేశ్వర్: పాలిథిన్ నివారణతో పర్యావరణ పరిరక్షణకు బారంగ్ నందన కానన్ యాజమాన్యం ముందడుగు వేసింది. నిత్యం ఈ జంతు ప్రదర్శనశాలకు పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో సందర్శకులు, పర్యాటకులు తరలి వస్తుంటారు. ఇటీవల కాలంలో పాలిథిన్, ప్లాస్టిక్ వినియోగం నివారణపై సర్వత్రా విస్తృతంగా ప్రచారం సాగుతోంది. దీనిలో భాగంగా బారంగ్ నందన్ కానన్ అధికార వర్గాలు సరికొత్త శైలిని ఆవిష్కరించి అమలు చేశాయి. ఈ ప్రయోగం అద్భుత ఫలితాలు సాధిస్తోందని నిర్వాహక వర్గం ఆనందం వ్యక్తం చేస్తోంది. నందన కానన్ ప్రవేశ ప్రాంగణంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో పాలిథిన్, ప్లాస్టిక్ నివారణకు ప్రత్యామ్నాయ కార్యాచరణ చేపడుతున్నారు. ఒక కేంద్రంలో పాలిథిన్ మార్పిడి మరో కేంద్రంలో ప్లాస్టిక్ నీటి సీసాల వినియోగం నివారణకు చర్యలు చేపడుతున్నారు.

నివారణ ఇలా

నందన కానన్ పరిసరాల్లో సందర్శనకు విచ్చేసే సందర్శకులు పాలిథిన్, ప్లాస్టిక్ సామగ్రి వినియోగించరాదు. ఈ మేరకు ప్రధాన ప్రవేశ మార్గంలో తనిఖీలు చేపడుతున్నారు. ముందస్తు అనుమతితో తాగునీటి ప్లాస్టిక్ బాటిళ్లను అనుమతిస్తారు. ఒక్కో ప్లాస్టిక్ బాటిల్‌కు రూ.50 చొప్పున నగదు జమ చేయాల్సి ఉంటుంది. సందర్శన ముగించుకుని తిరిగి వచ్చేటప్పుడు వినియోగించిన ప్లాస్టిక్ బాటిల్ దాఖలు చేస్తే ప్రవేశ సమయంలో జమ చేసిన రూ.50 నగదు యథాతథంగా తిరిగి ఇస్తారు. నగదు జమకు సంబంధించి సీసాకు అతికించిన స్టిక్కర్ సురక్షితంగా లేకుంటే నగదు రిటన్ చేయబడదు.

కాగితపు కవర్లు

పాలిథిన్ కవర్ల బదులుగా కాగితపు కవర్లను సందర్శకులకు అందజేస్తున్నారు. పర్యాటకులు తీసుకొచ్చిన పాలిథిన్ కవర్లలో పదార్థాలు వగైరా కాగితపు కవర్లలోకి బదిలీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. దీనికోసం జూ ప్రధాన ప్రవేశ ద్వారం ఆవరణలో ప్రత్యేక కేంద్రం నిర్వహిస్తున్నారు. సరళీకరించిన సంస్కరణ కార్యాచరణతో జరిమానా లేకుండా పాలిథిన్, ప్లాస్టిక్ నివారణ ఆశాజనకంగా ఫలప్రదం అవుతోందని అధికార వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ చర్యలపై పర్యాటకులు, సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాచరణ కట్టుదిట్టంగా కొనసాగితే అతి త్వరలో నందన కానన్ పాలిథిన్, ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా గుర్తింపు సాధించడం తథ్యమని సందర్శకుల వర్గం అభినందిస్తుంది.



పాలిథిన్ సంచుల మార్పిడి కేంద్రం



ముందస్తు షరతులతో ప్లాస్టిక్ నీటి బాటిళ్ల అనుమతి

క్లుప్తంగా

బెంగుళూర్ పర్యటనకు గిరిజన యువత



పర్యటనకు వెళ్తున్న గిరిజన యువతతో బీఎస్ఎఫ్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఎంవీ 3 బీఎస్ఎఫ్ క్యాంప్ కార్యాలయంలో బీఎస్ఎఫ్ డీఐజీ సైలేంద్ర సిన్హా అధ్వర్యంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి 21 వరకు చిత్రకొండ సమితి బోడపోద్ద, బంగుర్‌పోద, ఫుల్‌పోదర్, ఆర్ఎస్‌పీ 1, 4, 5, 10, 11, 19 గ్రామాలకు చెందిన 30 మంది యువతీ, యువకులను బెంగుళూర్ తీసుకొని వెళ్లనున్నట్లు వెల్లడించారు. గిరిజన యువతలో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా పర్యటనలు సాగుతున్నాయన్నారు. బెంగుళూర్‌లో ఉన్నటువంటి పర్యాటక ప్రదేశాలతో పాటు సినీ, రాజకీయ ప్రముఖులను కల్పిస్తామని పేర్కొన్నారు. పర్యటనలో 20 మంది అబ్బాయిలు, 10 మంది అమ్మాయిలతో పాటు 6 గురు బీఎస్ఎఫ్ సిబ్బంది ఉంటారన్నారు. మొత్తం ఖర్చులు తామే భరించనున్నట్లు తెలిపారు.

85 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలతో గ్రామస్తులు

రాయగడ: సదరు తహసీల్ పరిధిలోని కెరండి, లంబేషు గ్రామాల్లో నిరుపేదలైన 85 మందికి గురువారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. రాయగడ తహసీల్దార్ ప్రియదర్శని స్వాయి, అదనపు తహసీల్దార్ దేవి ప్రసాద్ మల్లిక్, ఆర్ఐ తుషార్ రంజన్ బెహర తదితరులు కార్యక్రమంలో పాల్గొని పేదలకు పట్టాలు పంపిణీ చేశారు. లంబేషు గ్రామంలో 61 మందికి, కెరండీ గ్రామంలో 14 మందికి ఇళ్ల పట్టాలు అందాయి.

ఉపాధ్యాయిని ఇంట్లో చోరీ



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు గంగా, అతని తండ్రి

రాయగడ: స్థానిక సాయిప్రియ నగర్ ఆరో లైన్‌లో నివసిస్తున్న ఉపాధ్యాయిని సీహెచ్ గంగా ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటి తలుపులను విరగ్గొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 9వ తేదీన బాధితురాలి తండ్రి అస్వస్థతకు గురవ్వడంతో చికిత్స కోసం విశాఖపట్నంకు తీసుకెళ్లారు. అనంతరం బుధవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని నిర్ధారణకు వచ్చారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. దొంగలు బాధితురాలి ఇంట్లో 10 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.17 వేల నగదు దొంగిలించుకు వెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధీరజ్ సాహుతో బీజేడీ నాయకులకు సంబంధాలు



నిరసన చేపడుతున్న బీజేడీ నాయకులు

జయపురం: ఐటీ రైడ్స్‌లో పట్టుబడిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహుతో బీజేడీ నాయకులకు సంబంధాలు ఉన్నాయని జిల్లా బీజేపీ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం నిరసన తెలిపారు. ధీరజ్ సాహుతో నాయకుల సంబంధాలపై సమగ్రంగా విచారణ జరపాలని కోరారు. నిరసనలో కొరాపుట్ జిల్లా బీజేపీ సాధారణ కార్యదర్శి బైద్య నాథ్ మిశ్ర, నాయకులు ఖగేశ్వర మిశ్ర, బాలకృష్ణ మఝి, బిశ్వ త్రిపాఠబు, శివాజీ పట్నాయక్, నరసింగ గౌథ, ప్రదీప్ పట్నాయక్, అమర్ లాల్ అహుజ, మధు హియాల్, నళినీ దాస్, పూర్ణ పట్నాయక్, సరోజ్ పాణిగ్రహి పాల్గొన్నారు.

పాతమేఘవరంలో చోరీ

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం మేఘవరం పంచాయతీ పాతమేఘవరం గ్రామానికి చెందిన సోములు అనే వ్యక్తి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఇంట్లో పడుకున్న సమయంలో కిటికీ ఇనుప చువ్వలు తొలగించి దుండగులు ప్రవేశించారని, 5 తులాల బంగారం, రూ.50వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ మధుసూదన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని టౌన్‌హాల్‌లో నిర్వహించిన ఒడిశా అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెద్వర్ ప్రధాన్ గురువారం ప్రారంభించారు. గురు, శుక్రవారాల్లో ప్రదర్శన ఉంటుందని ఆయన తెలియజేశారు. ఎగ్జిబిషన్‌లో ముఖ్యంగా ఒడిశాకు చెందిన దివ్యాంగ కళాకారుడు వినోద్ రౌతరాయి, కళాకారులు ఎస్.చంద్రశేఖర్‌రావు, డి.నారాయణరావు, రాంహరి జెన్న, అక్షయ్ కుమార్ పట్నాయక్, అమర్ కుమార్ జెన్న, అనిత్ కుమార్, దాస్‌ముర్ము, దీనబంద్ సాహు, రవినారాయాణ్ గుప్త, ప్రమోద్ కుమార్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.
– మల్కన్‌గిరి



ఆదివాసీ జీవన చిత్రం



గడియారంతో గాంధీజీ చిత్రం




జగన్నాథ స్వామి చిత్రం



యుద్ధ సన్నాహక దృశ్యం



రథయాత్ర చిత్రం



పూరీ రాజు ఆధ్వర్యంలో జగన్నాథస్వామి పూజా చిత్రం



చెట్టుకింద గిరిజనుల పూజా విధానం



టౌన్‌హాల్‌లో అమర్చిన వివిధ చిత్రాలు

ఇద్దరు దొంగలు అరెస్టు



అరెస్టైన నిందితులు



స్వాధీనం చేసుకున్న నగదు, తుపాకీ, సెల్‌ఫోన్లు

బరంపురం: కొద్ది రోజులుగా గంజాం జిల్లాలో జరుగుతున్న దోపిడీ కేసులతో సంబంధం ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఎన్‌పూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్పీ సార్వణ్ వివేక్ మాట్లాడుతూ.. అరెస్టైనవారిలో గజపతి నగర్‌కి చెందిన సుజీత్ కుమార్ పాడి, అంకులి గ్రామానికి చెందిన టిక్కి అలియాస్ జగదీప్ బెహరాలు ఉన్నట్లు గుర్తించారు. వారి దగ్గర నుంచి రూ.10 వేల నగదు, బైక్, తుపాకీ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అరెస్టైనవారిని సాయంత్రం కోర్టులో హాజరుపరిచి, బరంపురం సర్కిల్ జైలుకి తరలించినట్లు చెప్పారు.

బండి చక్రానికి చీర చుట్టుకుని..

- రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ భార్యకు తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుజాత

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని అరసవిల్లి మిల్లు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ ఎస్ఐ ఎస్.ఎస్.దొర తెలిపి వివరాల మేరకు.. అమలాపురం టౌన్ సూర్యానగర్ దొమ్మటివారి వీధికి చెందిన గోరింట మృత్యుంజయవర్మ రాజమండ్రి సిటీ ఏఆర్ వింగ్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. భార్య సుజాతతో కలిసి ఈనెల 13న విజయనగరం జిల్లా భోగాపురం మండలం సవరవిల్లిలో ఉన్న బంధువుల ఇంటి కార్యక్రమానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. అదే బండిపై గురువారం అరసవిల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి బయలు దేరారు. మిల్లు జంక్షన్ దాటాక సుజాత చీర పైట అంచు బండి చక్రానికి చుట్టుకోవడంతో ఒక్కసారిగా కిందపడింది. ఈ ఘటనలో సుజాత తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆటోలో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దొర చెప్పారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న తపాలా ఉద్యోగులు

శ్రీకాకుళం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులు గురువారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలని 2018లో సమ్మె చేస్తే కేవలం ఒక పేస్కేల్ మాత్రమే మంజూరు చేశారని, సానుకూల అంశాలను పరిష్కరించలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యి మంది గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నట్లు జీడీఎస్ నాయకులు నందికేశ్వరరావు, మూర్తినాయుడు తదితరులు తెలిపారు. సమ్మెకు ఏన్ఈపీఈ అనుబంధ సంఘాలైన గ్రూప్‌సీ పోస్టుమేన్ అండ్ ఎంటీఎస్ ఉద్యోగులు మద్దతు తెలియజేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు రామకోటేశ్వరరావు, అప్పారావు, గురన్న, ప్రకాశరావు, తేనేశ్వరరావు, గణపతి, సురేష్, సూరిబాబు పాల్గొన్నారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: స్థానిక ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన అదాం హేమసుందర్(51) గురువారం యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టెక్క లి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హేమసుందర్ గతంలో ఇంజనీరింగ్ కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేసేవా డు. కొద్ది నెలలుగా పనికి వెళ్లకుండా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం మద్యం తాగి ఇంటికి వచ్చి ఇంకా తాగేందుకు డబ్బులు కావాలని భార్యను అడ గ్గా తన వద్ద డబ్బులు లేవని ఆమె గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్థాపం చెందిన హేమసుందర్ శుక్రవారం ఇంట్లో బాత్ రూంలో వాడే యాసిడ్ తాగేశాడు. కుమారుడు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హేమసుందర్ మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నరసన్నపేట: మండలంలోని గోపాలపెంటకు చెందిన పొలుమూరు సావిత్రమ్మ (61) కాలిన గాయాలతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. వీఆర్వో బలగ రామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సింహాచలం తెలిపారు. నవంబర్ 11వ తేదీన ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీక్ కావడంతో సావిత్రమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు.

నేటి నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం నుంచి ఈ నెల 27 వరకు డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. 62 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి.

సంక్రాంతి రచనల పోటీలకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలోని విద్యాసంస్థల్లో చదువుతున్న ఇంటర్, డిగ్రీ, పిజీ విద్యార్థులకు తెలుగులో రచనల పోటీలకు ఆహ్వానిస్తున్నామని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. కవి త (అభ్యుదయకరమైన స్వేచ్ఛాంశంపై 30 పంక్తులకు మించకుండా), కథ (వ్యథామయ రైతు జీవితం ఇతివృత్తంగా 5పేజీలకు మించకుండా), వ్యాసం (పాలస్తీనాపై ఇజ్రాయిల్ యు ద్ధం. 2.వ్యవసాయ సంక్షోభం-ప్రకృతి ప్రకోపం-ప్రభుత్వ విధానాలు, 3.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి-ఆటంకాలు- పరిష్కారాలు (ఈ అంశాలలో ఏదో ఒకటి 3 పేజీలకు మించకుండా) విభాగాలలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. రచనలను వాట్సాప్ ద్వారా 9490098811 నంబరుకు పంపించవచ్చన్నా రు. జనవరి 10న జరిగే సభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

స్వర్ణ పతక విజేతలకు అభినందనలు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) ఎస్ఎంపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ మొదటి సంవత్సరం చదువుతున్న సి.హెచ్.పల్లవి విజయనగరంలో జరిగిన అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచి బంగారు పతకం సాధించింది. గుజరాత్‌లో జరగనున్న అండర్-17 జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలో పాల్గొనేందుకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థిని డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, అధికారులు గురువారం అభినందించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



వేదికపై హెచ్ఎం ధర్మారావు తదితరులు



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

పర్లాకిమిడి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఇకో క్లబ్ సభ్యుడు, ఉపాధ్యాయుడు జగన్నాథ పట్నాయక్ అన్నారు. గురువారం జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు సేవ్ ఎనర్జీ, సేవ్ లైఫ్ నినాదంతో చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వై.ధర్మారావు, డి.శ్రీరాంమూర్తిలు మాట్లాడుతూ.. ప్రకృతి సంపదను కాపాడాలని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు. సీఎన్‌జీ గ్యాస్, గోబర్ గ్యాస్‌ను గ్రామీణులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఇకో క్లబ్ సభ్యులు కె.జ్యోత్స్న, ఎం.సత్యనారాయణ, బి.రాజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంధన సంరక్షణ మీద నిర్వహించిన పెయింటింగ్, వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో బహుమతులను పొందిన విద్యార్థులకు బహుమతులు ప్రాధానం చేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీర్లకొండకు పోటెత్తిన యాత్రికులు



యాత్రకు హాజరైన యాత్రికులు, భక్తులు

ఇచ్ఛాపురం: పట్టణంలో ఏటా మార్గశిర గురువారంలో జరిగే పీర్లకొండ యాత్రకు భక్తులు పోటెత్తారు. కులమతాలకు అతీతంగా అధిక సంఖ్యలో యాత్రికులు, భక్తులు సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కొండ ప్రారంభ మెట్టు వద్ద కొబ్బరికాయ కొట్టి ధూపదీప నైవేద్యాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపై మొదటి ప్రార్థనామందిరం వద్ద పూజలు చేసిన అనంతరం రెండో ప్రార్థన మందిరం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు.

క్లుప్తంగా

ట్రెజరీ ఉద్యోగి ఆత్మహత్య


కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడిన గూడెపు రాజశేఖర్

కురుపాం: స్థానిక శోభ లతాదేవి కాలనీలో నివాసముంటూ ఎస్.కోట సబ్‌ట్రెజరీలో షరాఫ్‌గా విధులు నిర్వహిస్తున్న గూడెపు రాజశేఖర్ (33) కుటుంబ కలహాల కారణంగా గురువారం ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల సహకారంతో భార్య సౌందర్య కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు బంధువులు తెలిపారు.

కారులో 200 లీటర్ల సారా స్వాధీనం


తనిఖీల్లో పట్టుబడిన సారా, కారు, నిందితులతో ఎస్ఈబీ అధికారులు

కురుపాం: కురుపాం సమీపంలో గల మూలిగూడ జంక్షన్‌లో తనిఖీలు చేపట్టగా ఓ కారులో అక్రమంగా 10 క్యాన్లలో తరలిస్తున్న 200 లీటర్ల సారాను, కారును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్సై నాగభూషణరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు ఆ ప్రాంతంలో సిబ్బందితో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో సారా తరలిస్తూ పట్టుబడిన బచ్చలి అఖిల్, రంజన్, కనకదుర్గ, పిన్నింటి అఖిల్, వడ్డాది సురేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు.


ఓబీసీ రిజర్వేషన్లపై చర్చ

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


ఢిల్లీలో జరిగిన ఓబీసీ సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: భారత ప్రభుత్వ హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాగే సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ వంటి సాయుధ పోలీస్ దళాల్లో నియామకాలు, పదోన్నతుల్లో ఓబీసీ రిజ్వేషన్ల అమలుపై జాతీయ ఓబీసీ సమావేశంలో చర్చించినట్టు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఫోన్‌లో తెలిపారు. ఢిల్లీలో గురువారం జరిగిన ఓబీసీ పార్లమెంటరీ కమిటీ సభ్యులు సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు కొత్తగూడ విద్యార్థి


జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన శేఖర్‌కు కాంస్య పతకం బహుకరిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు)లో తొమ్మిదో తరగతి చదువుతున్న మండంగి శేఖర్ జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మల మాధవరావు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు నంద్యాలలోని కేఎస్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ స్కూల్‌గేమ్స్‌లో అండర్ 14 విభాగంలో పాల్గొన్న శేఖర్ ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు. 2024 జనవరి 14 నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో గల ఇందిర స్టేడియంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో శేఖర్ పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈమేరకు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన శేఖర్‌కు హెచ్ఎం నాగేశ్వరరావు, డిప్యూటీ వార్డెన్ టి.గంగారావులు అభినందనలు తెలిపారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

జామి: మండలంలోని ఎం.కె.వలసలో చేపట్టిన ఉపాధిహామీ పనులను ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన సభ్యులు గురువారం పరిశీలించారు. రైతు పి.ఎర్నాయుడు ఏర్పాటు చేసిన సెరీకల్చర్ యూనిట్‌ను సందర్శించారు. ఆదాయ వివరాలు తెలుసుకున్నారు. యూనిట్ ఏర్పాటుకు ఉపాధిహామీ నిధులు రూ.5,50,000, సెరీకల్చర్ విభాగం నుంచి రూ.3,18,000 మంజూరైందని, యూనిట్ నిర్వహణతో ఏటా ఏడాదికి రూ.4లక్షల ఆదాయం వస్తోందని తెలిపాడు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, ఏపీడీ శారదాదేవి, సెరీకల్చర్ ఏడీ ఎ.వి.సాల్మన్‌రాజు, ఏపీఓలు శేఖర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పేదల బంధువు జగన్

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు
- 652 కుటుంబాలకు పట్టాల పంపిణీ
- 330 ఎకరాలకు శాశ్వత హక్కులు
- 159 మందికి అసైన్డ్ భూములు


లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తదితరులు

శృంగవరపుకోట: ఏరాష్ట్రంలోనూ ఎవరూ చేయని విధంగా ప్రతి పథకం, ప్రతి పని పేదల కోసమే జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చేస్తున్నారని, ఆయన పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎరుకమ్మ పేరంటాలు కల్యాణ మంటపంలో నిర్వహించిన సంపూర్ణ భూహక్కు పథకంలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా పేదలు దున్నుతున్న భూములకు వారికి హక్కులు లేక, దున్నుకోవడానికి భూమి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి కన్నా ముందు ఎందరో నేతలు రాష్ట్రాన్ని పాలించినా పేదలకు శాశ్వత హక్కు కల్పించలేక పోయారు. నేడు 20 సంవత్సరాలకు పైబడి భూములు దున్నుతున్న పేదలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ 652 కుటుంబాలకు 330 ఎకరాలు వారి సొంతం చేస్తూ ఫ్రీ హోల్డింగ్ పట్టాలు ఇస్తున్నారన్నారు. వేపాడ మండలంలోని కేజీపూడి గ్రామంలో 159 కుటుంబాలకు ఎ.233.68సెంట్ల భూములకు అసైన్డ్ పట్టాలు ఇస్తున్నారని, దీంతో పేదలకు ఒక భరోసా, ఆస్తి, సామాజిక హోదా, రుణాలకు, క్రయవిక్రయాలకు ఇబ్బందులు లేకుండా 22ఏ రిజిస్టర్ నుంచి మినహాయించి, జిరాయితీగా మార్చి వారి పేరున ఆస్తిని అప్పగించిన ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనన్నారు. ఈ కసరత్తు చేసిన రెవెన్యూ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

టీడీపీది రియల్ ఎస్టేట్ వ్యాపారం

నాడు చంద్రబాబు అధికారం ఇస్తే అన్నీ చేస్తానంటూ చెప్పి మోసం చేస్తే , ఇచ్చిన ప్రతిమాటకు కట్టుబడి అందరి కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. 2014నుంచి 2019వరకూ టీడీపీ నేతలు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తే నేడు జగన్ 20 ఏళ్ల తర్వాత పేదలకు భూ పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎంపీపీలు డి.సత్యవంతుడు, ఎస్.గోపమ్మ, జెడ్పీటీసీలు టి.వరలక్ష్మి, జి.సరయు, వైఎస్సార్‌సీపీ నేత మెరపుల సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం కార్యదర్శి చల్లా జగన్ తదితరులు మాట్లాడారు. ఐదు మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు, ఐదు మండలాలకు చెందిన లబ్ధిదారులు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరయ్యారు.


పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

చంద్రబాబు మోసం చేశారు



పేదలకు అన్నీ చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశాడు. ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి అడగకుండానే మా కష్టం తెలిసి సాయం చేశాడు. తాతల దగ్గర నుంచి దున్నుకుంటున్న భూమికి ఈ రోజు మమ్మల్ని యజమానుల్ని చేసి హక్కు ఇచ్చిన ఆయన రుణం తీర్చుకోలేం. చాలా సంతోషంగా ఉంది.

పాటూరు అర్జునమ్మ,
చినఖండేపల్లి, ఎస్.కోట మండలం

పిలిచి పట్టాలు ఇచ్చారు



మేము దున్నుకుంటున్న భూములకు పట్టాలు ఇమ్మని ఏళ్ల తరబడి అడుగుతానే ఉన్నాం. ఎన్నో సార్లు ఆఫీసుల చుట్టూ తిరిగాం. ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు జగనన్న పుణ్యమాని మమ్మల్ని పిలిచి పట్టాలు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

- సారి వీరమ్మ,
కేజీ బూడి గ్రామం, వేపాడ మండలం

మాకు భరోసా ఇచ్చారు



మాకూ భూమి ఉంది. కష్టం వచ్చినా, నష్టం వచ్చినా ధైర్యంగా ఉండొచ్చన్న ధైర్నిన్ని జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చారు. మేము దున్నుకుంటున్న భూమికి మాకు ఎస్.కోట పిలిచి పట్టాలు ఇచ్చారు. ఆ భూములపై మాకు అన్ని హక్కులు ఉంటాయని అధికారులు చెప్పారు. ఇంతకన్నా ఏం కావాలి. అడగకుండానే కష్టం తెలుసుకుని సాయం చేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

ఎద్దు కామలక్ష్మి, కిర్ల గ్రామం, జామి మండలం.

సచివాలయం ప్రారంభం

- హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని తాటిపూడిలో రూ.40లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాటిపూడి సచివాలయం పరిధిలో ఉన్న 1063 ఇళ్లకు రూ.12 కోట్ల 80 లక్షల మేరకు వివిధ సంక్షేమ పథకాల రూపంలో అందించినట్లు చెప్పారు. రూ.20 కోట్లతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి ప్రారంభించామని తెలియజేశారు. టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి ఆమలు చేయని హమీలపై వాగ్దానాలు చేస్తారని వాటిని ప్రజలు నమ్మవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ సూర్యనారాయణ రాజు, పొట్నూరు సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జమ్ము స్వామినాయుడు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ పద్మావతి, సర్పంచ్‌లు చందక బంగారునాయుడు, కలిశెట్టి అప్పలరాజు, ఎంపీటీసీ రామకృష్ణ, స్థానిక నేతలు గూడేల ప్రభాకర్, మురళి పాల్గొన్నారు.

సైనిక పాఠశాలలో కొనసాగుతున్న క్రీడాపోటీలు


లాంగ్ జంప్‌లో విద్యార్థి


హైజంప్ చేస్తున్న విద్యార్థిని

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాల 61వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు రెండో రోజైన గురువారం కొనసాగాయి. గజపతి, గుప్త, మొఘల్, చాళుక్య, పాండ్య, పల్లవ, కాకతీయ, మౌర్య హౌస్‌ల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు పలు క్రీడాంశాల్లో పాల్గొన్నారు. ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హైజంప్, లాంగ్ జంప్ తదితర క్రీడాంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పోటీలను సైనిక పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఎస్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ కేశవన్ పర్యవేక్షించారు.

నేడు పార్వతీపురంలో జాబ్‌మేళా

పార్వతీపురం: పార్వతీపురంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా నిర్వహించనున్న జాబ్‌మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యవత సద్విని యోగం చేసుకోవాలని కోరారు. పది, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు తమ వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

16,17 తేదీల్లో జాతీయ సీనియర్ ఆర్బిటర్ సెమినార్

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సారథ్యంలో జిల్లా అసోసియేషన్ నిర్వహణలో ఈనెల 16,17 తేదీల్లో జాతీయ స్థాయి సీనియర్ ఆర్బిటర్ సెమినార్, ఎగ్జామినేషన్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేవీ.జ్వాలాముఖి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 40 మంది పాల్గొంటారని..రెండు రోజుల పాటు నిర్వహించే సెమినార్, ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్‌లు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభా పరీక్షను ఢిల్లీ నుంచి వచ్చే అంతర్జాతీయ ఆర్బిటర్ స్వప్నిల్ బన్సూడ్ పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


రామకృష్ణ మృతదేహం

పాచిపెంట: మండలంలోని కొత్తవలస గ్రామానికి చెందిన గండి రామకృష్ణ (50) విద్యుత్‌షాక్‌తో గురువారం మరణించాడు. ఈ మేరకు ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం పొలంలో మందు కొట్టేందుకు వెళ్లిన రామకృష్ణ కాలికి విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో గిరిజన విద్యార్థిని..


సీత మృతదేహం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేదారిపురం కాలనీ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)లో 6వ తరగతి చదువుతున్న బిడ్డిక సీత (11) అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న సీతకు బుధవారం జ్వరం, పిట్స్ రావటంతో ఆశ్రమ పాఠశాల సిబ్బంది మందులు అందించారు. జ్వరం తగ్గినప్పటికీ క్లాస్‌కు రాకుండా విశ్రాంతి తీసుకోవాలని సిబ్బంది సూచించారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో సీత బాత్‌రూమ్‌కు వెళ్లివస్తుండగా ఫిట్స్ రావటంతో పడిపోయిందని, గమనించి హుటాహుటిన ఆటోలో తాడికొండ పీహెచ్‌సీకి వైద్యం నిమిత్తం తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని డిప్యూటీ వార్డెన్ ఆశారాణి, హెచ్ఎం భవాని తెలిపారు. చెముడుగూడ పంచాయతీ పుట్టగూడ గ్రామానికి చెందిన సీతతో పాటు, ఆమె అక్క గీత కూడా ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఈ సమాచారం తెలుసుకున్న ఏటీడబ్ల్యూఓ సురేష్ కుమార్ ఆశ్రమ పాఠశాలతో పాటు ఆస్పత్రికి వెళ్లి పరిశీలించి మృతికి గల కారణాలపై ఆరాతీశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

గజపతినగరం: గజపతినగరం మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన సత్తారు సత్యనారాయణ (33) విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు స్థానిక ఏఎస్సై మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గడిచిన 12వ తేదీన ముచ్చర్ల గ్రామంలో అంబలంపూజ చేస్తున్న స్వాములకు లైటింగ్ ఏర్పాటు కోసం ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి బంధువులు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి గణిత క్విజ్ పోటీలకు ఎంపిక పూర్తి


విజేత బృందంతో ఫోరం రాష్ట్ర సలహాదారు త్రినాథరావు, ఫోరం సభ్యులు

విజయనగరం అర్బన్: శ్రీకాకుళంలో ఈ నెల 16న జరిగే రాష్ట్రస్థాయి గణిత క్విజ్ పోటీలలో పాల్గొనే జిల్లా బృందం ఎంపిక ప్రక్రియను స్థానిక మహారాజా సాంస్కృతిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం జిల్లా కమిటీ పూర్తి చేసింది. ఈ మేరకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలకు జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి క్విజ్ పోటీలలో డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జె.సురేష్, సీహెచ్‌హర్ష, పి.పురుషోత్తం విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయి విజేతలుగా నిలిచిన ఈ బృందం రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరఫున పాల్గొంటుందని ఫోరం రాష్ట్ర గౌరవ సలహాదారు సిద్ధాంతం త్రినాథరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు వి.చిన్నారావు, ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, ఫోరం ప్రతినిధులు ఎస్.రాంబాబు, శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా వాయిదా



వాలీబాల్, ఖోఖో క్రీడాంశాల్లో సాధన చేస్తున్న క్రీడాకారులు

- డిసెంబర్ 26 నుంచి ప్రారంభం కానున్న పోటీలు
- ఈనెల 17 వరకు రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

విజయనగరం: మిచాంగ్ తుఫాన్ ఎఫెక్ట్ ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణపై పడింది. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 5 క్రీడాంశాల్లో 51 రోజులు పాటు అతి పెద్ద క్రీడా సంబరానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం విదితమే. అయితే మిచాంగ్ తుఫాన్ ప్రభావిత నష్టాలను అంచనాలు వేయడంలో అటు అధికార యంత్రాంగం, ఇటు సచివాలయ ఉద్యోగులు నిమగ్నం కావడం మరో వైపు వర్షాలకు మైదానాలు సైతం పాడవడంతో వాయిదా నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. వాయిదా పడిన పోటీలను ఈనెల 26 నుంచి ప్రారంభించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

తుఫాన్ ప్రభావంతో వాయిదా:

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ మేరకు శాప్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈనెల 15 నుంచి ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. డిసెంబర్ 26 నుంచి సచివాలయ స్థాయిలో పోటీలు ప్రారంభమవుతాయి. ఈ నెల 17వ తేదీ వరకు క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం గడువు పెంచింది.

అచ్యుత్‌కుమార్,
జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, విజయనగరం.

పవర్ పంచ్..!

- రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు
- 25 మెడల్స్ సొంతం
- అండర్–14,17,19 విభాగాల్లో ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో రన్నరప్


బాక్సింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పంచ్‌పవర్ చూపించారు. ఈనెల 11,12,13 తేదీల్లో విజయనగరం వేదికగా అండర్ –14,17,19 వయస్సుల విభాగాల్లో జరిగిన పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు దక్కించుకుని జిల్లా కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పారు. మూడు విభాగాల్లో జరిగిన పోటీల్లో మొత్తంగా 25 మెడల్స్‌ను జిల్లా క్రీడాకారులు దక్కించుకోగా..అందులో 5 బంగారు, 10 వెండి, 10 కాంస్య పతకాలు ఉన్నాయి. అంతేకాకుండా త్వరలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు రాష్ట్ర జట్టులో ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అదేవిధంగా ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో మూడు వయస్సుల విభాగాల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు రన్నరప్‌గా నిలవడం విశేషం. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, కోచ్ బి.ఈశ్వరరావులు అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఎంఎల్‌హెచ్‌పీ ఆత్మహత్యా యత్నం

- వైద్యాధికారి వేధింపులే కారణమని ఆరోపణ


భద్రగిరి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న గొర్లె గౌరీలక్ష్మి

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని వలసబల్లేరు సబ్ సెంటర్‌లో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న గొర్లె గౌరీలక్ష్మి గురువారం మధ్యాహ్నం సూసైడ్ నోట్ రాసి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయం గమనించిన అక్కడి వైద్య సిబ్బంది భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఆమెను హుటాహుటిన తీసుకురాగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. విజయనగరం జిల్లా బుడతనాపల్లి గ్రామానికి చెందిన గౌరీలక్ష్మి మొండెంఖల్ పీహెచ్‌సీకి అనుసంధానంగా ఉన్న వసలబల్లేరు సబ్ సెంటర్‌లో ఏడాది నుంచి ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తోంది. విధుల్లో చేరినప్పటి నుంచి మొండెంఖల్ పీహెచ్‌సీలోని హెచ్‌వీ భారతి, వైద్యాధికారి ప్రజ్ఞ తనను ఎంతగానో వేధిస్తున్నారని, వ్యక్తిగతంగా కక్షసాధిస్తున్నారని, అందరి ముందు అవమానిస్తున్నారని, ఆ వేధింపులు భరించలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానంటూ సూసైడ్‌నోట్‌లో పేర్కొంది. భద్రగిరి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న గౌరీలక్ష్మిని పరామర్శించేందుకు వచ్చిన మిగతా ఎంఎల్‌హెచ్‌సీపీలు మాట్లాడుతూ వైద్యాధికారి, హెచ్‌వీ తమను నిత్యం వేధిస్తున్నారని, సమావేశాల పేరుతో రాత్రి 10 గంటల వరకు ఆస్పత్రిలోనే ఉంచేస్తారని, జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. వైద్యాధికారి, హెచ్‌వీలను వేరే చోటకు బదిలీ చేయకుంటే తామంతా ఉద్యోగాలకు రాజీనామా చేస్తామని స్పష్టం చేశారు.

విధుల్లో నిర్లక్ష్యంపై ప్రశ్నించానని..

గౌరీలక్ష్మి ఆత్మహత్యాయత్నంపై మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రజ్ఞ దృష్టికి తీసుకెళ్లగా ఎంఎల్‌హెచ్‌పీలందరికీ రికార్డులు, డ్రగ్‌స్టోర్లు సక్రమంగా నిర్వహించాలని పదే చెబుతూనే ఉన్నామని, గురువారం వలసబల్లేరు సబ్‌సెంటర్‌లో విజిట్ చేయగా ఎక్స్‌పైర్ అయిన డ్రగ్స్, రక్తపరీక్షల కిట్లు డ్రగ్‌స్టోర్‌లో ఉన్నాయని, రికార్డులన్నీ ఇన్‌కంప్లీట్‌గా ఉన్నాయని ప్రశ్నించగా వేధిస్తున్నానని ఆరోపిస్తూ ఇలాంటి చర్యకు పాల్పడిందని పేర్కొన్నారు. ఎంపీహెచ్‌పీల పనితీరుపై గతంలో పలుమార్లు నోడల్‌ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లి, పలువురికి మెమోలు కూడా జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఎల్విన్‌పేట పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

శరవేగంగా విమానాశ్రయ నిర్మాణం


విమానాశ్రయ నిర్మాణం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

- భోగాపురం విమానాశ్రయ పనులను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటిని కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ గురువారం సాయంత్రం పరిశీలించారు. మొత్తం 9 జోన్‌ల పరిధిలో విమానాశ్రయం, రన్‌వే, వర్క్‌షాప్, కాంక్రీట్ ప్లాంట్, పరిపాలనా భవనం, ట్రంపెట్ రహదారిని నిర్మించే ప్రాంతాలను సందర్శించారు. భూమి చదును చేస్తున్న పనులు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, మ్యాప్‌లను పరిశీలించారు. నిర్మాణ పనులు గురించి జీఎం ఆర్ అధికారులు రామరాజు, కోటేశ్వరరావు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, రహదారుల నిర్మాణం గురించి కలెక్టర్ ఆరా తీశారు. రాత్రీపగలు ఏకధాటిగా పనులు జరుగుతున్నాయని, జనవరి నెలాఖరులోగా ప్రహరీ నిర్మాణం పూర్తి చేస్తామని వివరించారు. ఈ పర్యటనలో విజయనగరం ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, భోగాపురం తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా నూతన కార్యవర్గం

విజయనగరం: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విజయనగరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని పూల్‌బాగ్‌కాలనీలో గల సంస్థ ప్రాంతీయ శిక్షణ, క్యాంపింగ్ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికకు 43 మంది సభ్యులు హాజరై నూతన కార్యవర్గ సభ్యులను ఏక్రగీవంగా ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గంలో అధ్యక్షురాలిగా కలెక్టర్ వ్యవహరించనుండగా..ఉపాధ్యక్షులుగా జెడ్పీ సీఈఓతో పాటు సీహెచ్ నారాయణమూర్తి, వి.త్రినాథనాయుడులు బాధ్యతలు చేపట్టనున్నారు. అదే విధంగా చీఫ్ కమిషనర్‌గా జిల్లా విద్యాశాఖ అధికారిని ఎన్నుకోగా..స్కౌట్స్ కమిషనర్‌గా ఈపు విజయకుమార్, అడల్ట్స్ రీసోర్స్ జిల్లా కమిషనర్‌గా వాక చిన్నంనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శిగా ఎస్.కనకమహాలక్ష్మి నియమితులయ్యారు. కోశాధికారిగా ఎం.భాస్కరరావు, జిల్లా ట్రైనింగ్ కమిషనర్‌గా వి.సూరిబాబు, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్‌గా దేవరాపల్లి ప్రవీణ్‌కుమార్, గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్‌గా ఎ.కనకమహాలక్ష్మి, ఆర్గనైజింగ్ కమిషనర్‌గా కొల్లి గాయత్రితో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.